క్లుప్తంగా

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు రూ.వెయ్యి వేతనం పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక మున్సిపల్ కార్మికులు శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు నీర్మాల ఎల్లమ్మ, లక్ష్మణ్, సోమయ్య, శ్రీను, వెంకట్, బాబు, యాదగిరి, రామనర్సయ్య, పద్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ పట్టణ, మండల కమిటీ ఎన్నిక



మల్లెపాక కృష్ణ, మండల అధ్యక్షుడు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలో శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండల, పట్టణ కమిటీ అధ్యక్షులను నియమించారు. మండలంలోని తొండ గ్రామానికి చెందిన మల్లెపాక కృష్ణను తిరుమలగిరి మండల అధ్యక్షుడిగా, ఊడుగు సుధాకర్‌ను పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు చింత కుంట్ల చింతయ్య తెలిపారు. ఈ సందర్భంగా చింతయ్య మాట్లాడుతూ.. డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి ఎర్ర రాంబాబు, మందుల నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో ట్రాక్టర్ యజమానులు

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం నిర్వహించిన ట్రాక్టర్ల యాజమానుల సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా యాస ఉప్పల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఉప్పుల సతీష్, కార్యదర్శిగా గోల్కొండ ఉప్పలయ్యతో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్ ఓనర్లు కళ్లెం కృష్ణారెడ్డి, జటంగి గణేష్, ఇమ్మారెడ్డి మహేష్‌రెడ్డి, జక్కుల ఉప్పలయ్య, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిలుముల గంగారెడ్డి, సుధీర్, ముత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు



బెంచీల ఏర్పాటులో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని పలు సెంటర్లలో, పాఠశాలల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రంగౌడ్ మాట్లాడుతూ.. దాతల సహకారంతో ప్రజల సౌకర్యార్థం బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఇంకా కొన్ని చోట్ల ఏర్పాటు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఐతె శ్రీనివాస్, కోశాధికారి సురేష్‌కుమార్, పద్మారెడ్డి, లక్ష్మయ్య, కాలియా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయికులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణోదయ రామారావు 4వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ సమాఖ్య నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. నూతనకల్ మండల కేంద్రంలో మే 10న సభను నిర్వహించనున్నట్లు సభకు కవులు, కళాకారులు, సాహితీ ప్రియులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, గండు నగేష్, బండి రవి, పిడమర్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.

లారీల కొరతతో రైతుల అవస్థలు

- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎగుమతుల్లో జాప్యం
- మిల్లుల్లో సకాలంలో దిగుమతి కాక లారీ యజమానుల పాట్లు
- కేంద్రాల్లో పేరుకుపోయిన 21,628 ధాన్యం బస్తాలు



కొమ్మాల పీఏసీఎస్ కేంద్రంలో కాంటాలై నిల్వఉన్న ధాన్యం బస్తాలు



రామన్నగూడెంలో ధాన్యం ఎగుమతి కాక బస్తాలపై పట్టాలు కప్పుకున్న రైతులు

అర్వపల్లి : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవడానికి అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే వడగళ్ల, అకాల వర్షాలతో పంటలు తీవ్రంగా నష్టపోయి అల్లాడిపోతున్న రైతులకు కోసిన ధాన్యాన్ని సకాలంలో అమ్ముకోలేకపోతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ సీజన్‌కు గాను 20ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరిస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు 2,17,487 బస్తాల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోళ్లు చేయగా ఇందులో 1,95,859 బస్తాల ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లులకు ఎగుమతి చేశారు. ఇంకా కేంద్రాలలో 21,628 బస్తాల ధాన్యం కాంటాలై ఎగుమతి కాక నిల్వ ఉన్నాయి. ఈ కాంటాలైన ధాన్యం బస్తాలు వర్షాల కు తడవకుండా రైతులు పట్టాలు కప్పుకోగా, కొన్ని గ్రామాల్లో పట్టాలు సరిపోను లేక వర్షం వస్తే బస్తాలు తడిసే పరిస్థితి నెలకొంది. ధాన్యం ఎగుమతికి లారీల కొరత ఏర్పడడంతో ఈ పరిస్థితి నెలకొంది.

సకాలంలో దిగుమతి కాక..

మండలంలోని 20 కొనుగోలు కేంద్రాలకు 40వరకు లారీలను ఏర్పాటు చేశామని ధాన్యం ఎగుమతి కాంట్రాక్టర్ చెబుతున్నా మిల్లుల్లో దిగుమతి సకాలంలో జరగక సమస్యలు ఏర్పడుతున్నాయి. అయితే తేమ అధికంగా ఉన్నా, శుభ్రం చేయని ధాన్యాన్ని కేంద్రాల నుంచి పంపిస్తుండటంతో దిగుమతి చేసుకోవడానికి ఇబ్బంది అవుతుందని మిల్లర్లు చెబుతున్నారు. అకాల, వడగళ్ల వర్షాలతో ఈ సమస్యలు ఏర్పడుతున్నాయి. కాగా లోడ్లతో వెళ్లిన లారీలు మిల్లుల వద్ద సకాలంలో దిగుమతికాక ఒకట్రెండు రోజులు ఆగాల్సి వస్తుండటంతో లారీల సమస్య ఎదురవుతుంది. అయితే ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని ప్రకటిస్తే, మిల్లర్లు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడ్ ఎప్పటికప్పుడు జరిపి లారీల కొరతను తీర్చి కాంటాలైన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలని అన్నదాతలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ధాన్యం సరిగా లేదని మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా చూడాలని కోరుతున్నారు.

కాంటాలైనా ఎగుమతి కాలేదు



తాను 200బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్మాను. అయితే కాంటాలు వేసిన బస్తాలు లారీల కొరతతో ఎగుమతికాకపోవడంతో వాటిపై పట్టాలు కప్పి ఉంచాను. కేంద్రాల్లో కాంటాలైన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీలను పంపించి ఎగుమతి చేయాలి.

– వెన్నమళ్ల వెంకటయ్య, రైతు, కొమ్మాల

లారీల కొరత లేకుండా చూస్తాం



మండల వ్యాప్తంగా లారీల కొరత రాకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్ పంపే లారీలతో పాటు సూర్యాపేటలోని జనగాం క్రాస్‌రోడ్, అర్వపల్లి వై జంక్షన్‌లో పోలీసుల సహకారంతో రెవెన్యూ సిబ్బందిని ఉంచి రోడ్లపై వెళ్లే లారీలను కూడా కేంద్రాలకు పంపించి ధాన్యాన్ని ఎగుమతి చేయిస్తున్నాం. రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసి తేమ లేకుండా తెస్తే మిల్లర్లు కొర్రీలు పెట్టే అవకాశం లేకుండా ఉంటుంది.

– పి.యాదగిరిరెడ్డి, నోడల్ అధికారి

ఓటమి భయంతోనే ఎమ్మెల్యేపై విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్

మద్దిరాల : వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని భయంతో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌పై ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోల్కొండ మల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్డగోలుగా ఇసుక మాఫియా చేస్తున్నారని ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించేది లేదని దమ్ముంటే నిజాలతో నిరూపించాలని అన్నారు. దళిత బంధు పథకంలో నియోకవర్గంలోని తిరుమలగిరిని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎన్నుకోని దాదాపు 25వందల కుటుంబాలకు దళిత బంధు అందించిన ఘనత ఎమ్మెల్యే కిశోర్‌దని అన్నారు. గతంలో మీ పాలనలో నియోజకవర్గంలో రక్తం ఏరులైపారేదని కాని ఇప్పుడు కాళేశ్వరం జలాలతో రైతుల కండ్లలో ఆనందం చూస్తున్నామని అన్నారు. మరోసారి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగ్గిన బుద్ధి చెపాల్సివస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నవీలా మల్సూర్, కొమ్ము రాజు, వెంపటి మల్లేష్, జ్ఞానసుందర్, వెంకన్న, మైసయ్య, నగేష్, ఉపేందర్, గణేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

బాల ఉగ్రలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలో గల దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్రలక్ష్మీనరసింహ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం కావడంతో భక్తులు ఆలయం వద్ద నుంచి దాదాపు కిలోమీటర్ మేర క్యూ లైన్ కట్టారు. దీంతో దర్శనానికి గంటకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఎర్రవరంలో స్వయంభు వెలసిన స్వామివారికి ఇంకా ఆలయం కూడా నిర్మించలేదు. అయినా భక్తులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. అయితే గత మార్చి నెలలో రూ.6 కోట్ల విరాళాలతో స్వామివారికి ఆలయం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. దీంతో కేవలం రెండు నెలల వ్యవధిలో శుక్రవారమే కాకుండా ఇతర దినాల్లో వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తున్నారు. కోదాడ ప్రాంత ప్రజలు, భక్తులే కాకుండా ఖమ్మం, నిజామాబాద్, హైదరాబాద్, పక్కనే ఉన్న ఏపీలోని కృష్ణ, గుంటూరుతో పాటు ఇతర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో స్వామి దర్శనానికి తరలివస్తున్నారు. కాగా ప్రతి శుక్రవారం హుండీ ఆదాయం రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. మార్చిలో జరిగిన శంకుస్థాపన నుంచి నేటి వరకు కేవలం రెండు నెలల్లోనే హుండీ ఆదాయమే రూ.80 లక్షలు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న స్థలం భవిష్యత్‌లో సరిపోదనే ఆలోచనతో 7 నుంచి 10 ఎకరాల స్థలం కొనేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు.

లింగవివక్ష నిర్మూలనకు పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ ఫౌండేషన్ మండల బాధ్యుడు చిప్పలపెల్లి రవి

నూతనకల్ : లింగవివక్ష నిర్మూలన కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని, సమాజంలో బాలికలకు ఎదురవుతున్న వివక్షతలను ఎదురించాలని ఎంవీ ఫౌండేషన్ మండల బాధ్యుడు చిప్పలపెల్లి రవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సోమ్లాతండా ఆవాసం తేజాతండాలో ఐసీడీఎస్, ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు బాలబాలికలను సమానంగా చూడాలని బాలురలతో సమానంగా బాలికలకు ఉన్నత విద్యను అందించాలని ఆయన కోరారు. బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గుగులోతు కమల, ఆంగోతు సుజాత, కిశోర బాలికల ప్రతినిధులు గుగులోతు రజిత, గుగులోతు సుష్మా, రాజేశ్వరి, నిహారిక, స్వప్న, వినోద తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్యదర్శుల నిరవధిక సమ్మె



అర్వపల్లిలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు



నూతనకల్ : నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



మద్దిరాలలో కార్యదర్శులకు నగదు అందజేసి మద్దతు తెలుపుతున్న సర్పంచ్ కొమరయ్య

అర్వపల్లి : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్, ఓపీఎస్‌లు చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్యదర్శులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.నవీన్‌రెడ్డి, కార్యదర్శులు నారాయణమూర్తి, నెహ్రూనాయక్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, జ్యోతి, మహాలక్ష్మి, ఫర్హాన, కావ్య, మాధవిక పాల్గొన్నారు.

నూతనకల్ : తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ తమను రెగ్యులరైజ్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్య దోరణి అవలంబిస్తుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ తమ పట్ల ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదని వారు విమర్శించారు. సమ్మెలో కార్యదర్శులు ఎస్.గంగరాజు, బాణాల మధుసూదన్‌రెడ్డి, వినోద, తాళ్లపెల్లి వెంకన్న, వెంకట్‌రెడ్డి, శ్రీనాథ్, ఉమేష్, సత్యవతి, శృతి తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధి సమ్మె శుక్రవారం 8వరోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు మండలంలోని కుక్కడం గ్రామసర్పంచ్ గుండ్ల కొమరయ్య, ఉపసర్పంచ్ బీసు పూలమ్మ వీరన్న తమ సంఘీభావాన్ని తెలిపారు. అనంతరం అరటి పండ్లను అందజేసి ఆర్థికసాయంగా రూ.2వేలను ఇచ్చారు. సమ్మెలో పంచాయతీ కార్యదర్శులు నాతి రమేష్, మంగ, గంట మహేష్, రేసు తరుణ్, ఉమ, లలిత, పుష్ప, తేజశ్రీ,విజయేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



గరుడముద్ద అందుకుంటున్న భక్తులు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని శ్రీభూగోదా సమేత చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్ల తిరుకల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాజ్ఞికులు కారంపూడి అనంతాచార్యస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6గంటలకు ప్రాతఃఆరాధన, ధ్వార తోరణపూజ, కుంభారాధన, బలిహారణ, గరుడహోమం, ధ్వజారోహణం, గరుడ ముద్ద, ఆరగింపు, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. సాయంత్రం 6.30గంటలకు నిత్యహోమం, రాత్రి స్వామివారి కల్యాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

దాచూరి రాంరెడ్డి సేవలు మరువలేనివి



రాంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : యూటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ దాచూరి రాంరెడ్డి యూటీఎఫ్‌ను స్థాపించి 25సంవత్సరాల పాటు వ్యవస్థాపక అధ్యక్షుడిగా సంఘానికి చేసిన సేవలు మరువలేనివని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో దాచూరి రాంరెడ్డి ఏడో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి ఉపాధ్యాయులు రాంరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య, జిల్లా కోశాధికారి వెంకటయ్య, యాకయ్య, ఎస్‌కె.సయ్యద్, పాపిరెడ్డి, రమేష్, డి.లాలు, శ్రీనివాసాచారి, ఆర్.శ్రీను, సీనయ్య, బండ్ల రమేష్, సైదాడ, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే వారోత్సవాలు



ఎర్రజెండా ఎగురవేస్తున్న ఆటో యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు

అర్వపల్లి : మండల కేంద్రంలో నకిరేకల్–తానంచర్ల రూట్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మేడే వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మెరుగు వీరమల్లు ఎర్రజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల శ్రీను, కొమారి నర్సింహరాజు, కె.కొమిరెల్లి, అంజయ్య, కృష్ణ, సీతారాములు, మల్లేష్, గోవిందు, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్నేహలత

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వేసవికాలంలో గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు కోరారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్, జెడ్పీటీసీ దూపటి అంజలి, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, ఎంపీడీఓ ఉమేష్‌చారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న హెచ్1 యూనియన్ నాయకులు

సూర్యాపేట : వైద్య ఆరోగ్యశాఖలో ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సహకరించిన రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును శుక్రవారం హైదరాబాద్‌లో ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్1 ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులు కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కలిసిన వారిలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, హెచ్1 యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సాయిరెడ్డి, సుదర్శన్, నాయకులు రాజశేఖర్, మచ్చగిరి, ఇందిరాల రామకృష్ణ, భూతరాజు సైదులు, యాతాకుల మధుబాబు, సత్యనారాయణ, వివిధ జిల్లాల హెల్త్ అసిస్టెంట్లు ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



చెట్లకు నీరు పోస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

చివ్వెంల(సూర్యాపేట) : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ ఎల్.లక్ష్మి అన్నారు. శుక్రవారం గ్రీన్ డే సందర్భంగా మండల పరిధిలోని బీమ్లాతండా పల్లె ప్రకృతి వనంలో మొక్కలకు నీరు పోసి మాట్లాడారు. పల్లెప్రకృతి వనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ టి.గోపి, సర్పంచ్ హాముడా నాయక్, టీఏ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం



చివ్వెంలలో వర్షానికి తడుస్తున్న ధాన్యంపై పట్టాలు కప్పుతున్న రైతు



చివ్వెంల : రోళ్లబండతండాలో తడిసిన ధాన్యం



పెన్‌పహాడ్ : భక్తాళాపురం కొనుగోలు కేంద్రంలో రాశులపై పట్టాలు కప్పుతున్న రైతులు

చివ్వెంల(సూర్యాపేట) : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. కొద్ది రోజులుగా కేంద్రాల్లోని ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నిర్వాహకులు ట్రాన్స్‌పోర్టు కావడం లేదనే సాకుతో రోజుల తరబడి సెంటర్లలో ధాన్యం ఉంచడంతో, అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని వాపోతున్నారు.

అకాల వర్షంతో అన్నదాతల అవస్థలు

పెన్‌పహాడ్ : అకాల వర్షంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం కురిసిన వర్షానికి ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. రాశుల్లోకి నీరు చేరడంతో వాటిని తొలగించి ఆరబెట్టుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని కేంద్రాల్లో భూమి చదునుగా లేకపోవడంతో తడిసి మొలకెత్తుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలేవీ?

- ప్రమాదాలబారిన పడుతున్న ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



చినగారకుంట తండా రహదారి వెంట ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు



జల్మాలకుంటతండా రహదారి వెంట..

పెన్‌పహాడ్ : ప్రజల అవసరాలను తీర్చడం కోసం విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు కరువయ్యాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు మూగజీవాలు, ప్రజల పట్ల యమపాశాలుగా మారుతున్నాయి. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని తండాలు, తదితర గ్రామాల్లో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాల నిమిత్తం అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. కానీ ప్రమాదాలు చోటు చేసుకోకుండా వాటి చుట్టూ ఏలాంటి రక్షణ ఏర్పాట్లు చేయలేదు. వాటి చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని నిబంధన ఉన్నప్పటికీ అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. వర్షాలు పడిన సమయంలో హెర్త్ వైర్‌లకు విద్యుత్ సరఫరా అయి మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు కోకొల్లలు. దీంతో రైతులకు పాడిగేదెలు మృతిచెందడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో పాటు రహదారుల వెంట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ లేకపోవడంతో మేతకోసం వెళ్లిన మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఆనుకొని విద్యుత్ షాక్‌తో మృతి చెందుతున్నాయి. ఇలాంటి ఘటనలు జరుగుతుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు..

రక్షణ వలయాలు లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఏక్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ల నిర్వహణపై చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ వలయాలు లేకపోవడంతో ప్రధాన రహదారులు, వీధుల వెంబడి ఉంటడంతో ప్రయాణికులు, పిల్లలు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని దూపహాడ్ నుంచి చెట్లముకుందాపురం, జల్మాలకుంట తండా, చీదెళ్ల నుంచి తంగెళ్లగూడెం వెళ్లే రహదారుల వెంట ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి రక్షణ వలయాలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ కంచెను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె వేయాలి

రహదారి వెంట ట్రాన్స్‌ఫార్మర్‌లతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే కొంత మంది రైతుల మూగజీవాలు మృతి చెంది నష్టాలు చవిచూశారు. ఇలాంటి ఘటనలు పునఃరావృతం కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి. తండాలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో లోవోల్టేజీ సమస్య కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– ధరావత్ బోజ్యా, చినగారకుంటతండా

రక్షణ వలయాలు ఏర్పాటు చేస్తాం



ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ రక్షణ కంచెల కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు నివేదించాం. అధికారుల నుంచి ఆమోదం పొందిన వెంటనే రక్షణ వలయాలు ఏర్పాటు చేస్తాం.

– మహేష్, విద్యుత్ ఏఈ, పెన్‌పహాడ్